నాకు అన్ని విధాలుగా సహాయ పడింది వలంటీరే..


రావూరి వరలక్ష్మి మద్దిపాడు

మద్దిపాడు: నాకు అన్ని విధాలుగా సహాయ పడింది వలంటీరే. మాది మద్దిపాడు గ్రామం, గత ప్రభుత్వంలో నాకు వృద్ధాప్య పెన్షన్ వస్తుండగా ఈప్రభుత్వం వచ్చిన తరువాత పెన్షన్ ఆగి పోయింది. ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసిన తరువాత మా క్లస్టర్ వలంటీర్ మద్దిరాల నీమిక.. నాకు పెన్షన్ రావడం లేదన్న విషయం గమనించి ఎందుకు రావడంలేదో సచివాలయంలో విచారించింది. వయసు తక్కువగా ఉండటంతో పెన్షన్ రావడం లేదని తెలుసుకుని నాకు తెలిపింది. ఈక్రమంలో నాభర్త నన్ను వదిలి వెళ్లి పోవడంతో ఒంటరి మహిళ పెన్షన్‌కు ఆమె దరఖాస్తు చేసి వెంటనే నాకు పెన్షన్ వచ్చేలా చేసింది. అంతే కాకుండా నాకు వేలిముద్ర సక్రమంగా పడకపోవడం వలన రేషన్ రాకపోతుండటంతో మా వలంటీరే వేలి ముద్రవేసి నాకు ప్రతి నెలా రేషన్ ఇప్పించింది. నేను బయటకు వెళ్లకుండానే వలంటీర్ నాకు సహాయం చేసింది.

రోడ్లను అపరిశుభ్రం చేస్తే చర్యలు

ఒంగోలు సబర్బన్: రోడ్లను అపరిశుభ్రం చేస్తే ఊరుకునేది లేదని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పశువుల పోషకులను హెచ్చరించారు. పేర్నమిట్టలో మంగళవారం ఎన్‌టీఆర్ కాలనీ, కుమ్మరిపాలెం, ఎస్సీ కాలనీల్లో పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్ల వెంట పశువులను కట్టివేయటం వలన అక్కడి రోడ్లు అపరిశుభ్రంగా ఉండటం గమనించారు. పశువులను రోడ్డుపై కట్టేవేసినా పట్టించుకోని శానిటరీ సెక్రటరీపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌టీఆర్ కాలనీలో ఇళ్ళ మీదుగా కరెంటు తీగలు వెళ్ళటం వలన ఇంటిలోని విద్యుత్ ఉపకరణాలకు విద్యుత్ షాక్ వస్తుందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్‌టీఆర్ కాలనీలో కొత్తగా మురుగు కాలువలు, మంచినీటి పైపులైన్‌లు ఏర్పాటు చేయటనికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కుమ్మరిపాలెంలో పర్యటించి మురుగు కాలువల శుభ్రం చేసే పనులను పరిశీలించారు. ప్రతి రోజూ చెత్త సేకరణకు ఆటోలు వస్తున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. క్లాప్ ఆటోలు వెళ్లే వీలులేని ప్రాంతాలకు తోపుడు బళ్ళు ద్వారా చెత్త సేకరణ చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. యూజర్ చార్జీలు విధిగా వసూలు చేయాలని కూడా ఆదేశించారు.


పోతురాజుపాలెంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పోతురాజుపాలెంలో ఇంటింటి సర్వే..

నగరంలోని 16వ డివిజన్‌లోని పోతురాజు పాలెం సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష పథకంలో భాగంగా ఇంటింటి సర్వేను పరిశీలించిన కమిషనర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తొలుత సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. బుధవారం పోతురాజు పాలెం సచివాలయంలో జగనన్న సురక్ష పథకం క్యాంపు ఉన్నందున జగనన్న సురక్ష పథకంలో ప్రతి ఒక్కరికి ఉద్దేశాన్ని తెలియజేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందాలన్నారు. ఏ ఒక్కరికీ సర్టిఫికెట్లు కానీ, పథకాలు కానీ రాలేదని ఏ ఒక్కరూ అనకూడదన్నారు. 63 శాతం సర్వే పూర్తయిందని, మిగతా 37 శాతం సర్వే కూడా పూర్తి చేయాలన్నారు. తక్కువ సర్వే చేసిన 6 మంది వలంటీర్లకు షో కాజ్ నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణంతో పాటు పలువురు పాల్గొన్నారు.

13న మెగా కంటి వైద్య శిబిరం


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

- సినీ నటుడు బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బూచేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా కంటి ఆపరేషన్లు

చీమకుర్తి: సినీ నటుడు బూచేపల్లి కమలాకర్‌రెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా ఈనెల 13న చీమకుర్తిలో బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం చీమకుర్తిలోని కమలాకర్ రెడ్డి పార్కు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన శంకర్ నేత్రాలయం సహకారంతో రోగులకు ఉచిత కంటి వైద్య పరీక్షలతో పాటు కంటి ఆపరేషన్లు ఉచితంగా బూచేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయించేందుకు అవకాశం కల్పించినట్లు బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద రెడ్డి తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో పెద కాకాని ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి తిరిగి చీమకుర్తికి తీసుకొచ్చే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 2వేల మందికి పైగా కంటి రోగులు హాజరయ్యారని, వారిలో కంటి ఆపరేషన్‌లకు వెయ్యి మంది ఎంపికైనట్లు తెలిపారు. వారందరినీ శంకర్ కంటి ఆస్పత్రికి తరలించినట్లు తెలియజేశారు. హాజరైన ప్రజానీకానికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కంటి వైద్య శిబిరం గురించి చీమకుర్తితో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేశామన్నారు. బూచేపల్లి ట్రస్ట్ ద్వారా బూచేపల్లి కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసే మెగా వైద్యశిబిరాన్ని చీమకుర్తి మండల, మరియు ఇతర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బాపతు వెంకట రెడ్డి, ఎస్.మాణిక్యం, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, పాలపర్తి వెంకాట్రావు, తప్పెట బాబూరావు, పాటిబండ్ల గంగయ్య, గంగిరెడ్డి సుందర రామిరెడ్డి, పార్టీ నాయకులు మన్నం శ్రీధర్, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనాభా పెరుగుదలతో సమస్యలు

ఒంగోలు టౌన్: జనాభా నియంత్రణ చేయకపోతే భవిష్యత్తులో అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావు అన్నారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకాశం భవన్ నుంచి రిమ్స్ హాస్పిటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. నగరంలోని హర్షిణి డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో స్పెషల్ కలెక్టర్ ప్రసంగించారు. జనాభా పెరుగుదల వలన కలిగే నష్టాలను వివరించారు. అమ్మాయిలు 21 సంవత్సరాలు, అబ్బాయిలు 28 సంవత్సరాలు పైబడిన తరువాతనే వివాహం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ బి.సురేష్ కుమార్ సూచించారు. డా.శ్రీవాణి, డా.సుగుణ,కళాశాల ప్రిన్సిపాల్ అంజనేయులు, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జనాభా పెరుగుదల వలన ఎదురయ్యే సమస్యలను ప్రిన్సిపాల్ డి.కల్యాణి వివరించారు. ప్రపంచ దినోత్సవ ప్రాధాన్యతను అర్థశాస్త్ర అధ్యాపకులు సి.హెచ్ శ్రీనివాసరావు వివరించారు. క్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కుసుమ కుమారి హాజరయ్యారు.

హాకీ స్టిక్స్ బహూకరణ


హాకీ స్టిక్స్ అందిస్తున్న హెచ్ఎం నరసింహారావు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు హాకీ క్రీడాకారులకు స్థానిక హాకీ క్లబ్ అధ్యక్షులు గొడుగు కాలేషా ఆర్థిక సహకారంతో హాకీ స్టిక్స్‌ను మంగళవారం అందించారు. రూ.25 వేల విలువ చేసే హాకీ స్టిక్స్ బహూకరించడంతో హైస్కూలు హెచ్ఎం డీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో పీడీ వనజ, రవి దాత కాలేషాను అభినందించారు. హాకీలో పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.రమేష్ పిలుపునిచ్చారు. 36 గంటల నిరసనలో భాగంగా కలెక్టరేట్ వద్ద జరిగిన రెండో రోజు నిరసనలో ఆయన ప్రసంగించారు. సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చొరవ చూపాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఐవీ రాఘవమ్మ, కేవీ సుబ్బమ్మ, ధనలక్ష్మి, సుజాత, మధురవాణి, జయప్రద, ప్రశాంతి, శ్రీపతి సతీష్, కేశవరావు, కొండా రెడ్డి, పి.కల్పన పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న స్టెప్ సీఈఓ, డీఎంహెచ్‌ఓ

ఒంగోలు అర్బన్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా యువజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, సదస్సులు నిర్వహించారు. ప్రకాశంభవనం వద్ద స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ సురేష్ మంగళవారం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ప్రకాశం భవనం నుంచి రిమ్స్ వరకు నిర్వహించి డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జనాభా 5 బిలియన్‌లకు చేరినప్పటి నుంచి ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. జనాభా పెరుగుదల వల్ల జరిలే నష్టాలపై చర్చించి అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, సుగణ, అంజనేయులు, ఆశా వర్కర్‌లు, శ్రీహర్షిణి కాలేజీ విద్యార్థులు, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.

అటానమస్ గుర్తింపుతో బాధ్యత పెరిగింది

- రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు

ఒంగోలు: అటానమస్ గుర్తింపుతో తమ బాధ్యత మరింత పెరిగిందని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019లో ఎన్‌బీఏ అక్రెడిటేషన్, 2022లో న్యాక్ ఎప్లస్, తాజాగా అటానమస్ గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. లాభాపేక్షతో సంబంధంలేకుండా విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తు, వెనుకబడిన ప్రకాశం జిల్లాలోని ప్రజానీకం ఆకాంక్షలకు అనుగుణంగా కాలేజీని నిర్వహిస్తున్నామన్నారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్లుగా సిలబస్‌ను మార్చుకునే అవకాశం కలుగుతుందని, మొత్తంగా విద్యార్థికి సంపూర్ణ సమగ్ర అభివృద్దే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు శిద్దా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థిలో ఉన్న అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికితీయడం, వారికి అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించడం, నాణ్యమైన బోధన అందిస్తున్నామన్నారు. కాలేజీ కోశాధికారి శిద్దా భరత్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గౌరవ చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ మాట్లాడుతూ కాలేజీ ప్రారంభం నుంచి నాణ్యత విషయంలో రాజీలేదన్నారు. రాగా కోఆర్డినేటర్ శిద్దా ప్రవల్లిక మాట్లాడుతూ సరళీకృత విధానం చేపట్టేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. రైజ్ కృష్ణసాయి కాలేజీ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ భాస్కరరావు మాట్లాడుతూ తమ కాలేజీలో 200 మంది విద్యార్థులు మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్ శిక్షణ పొందుతుండటం గొప్ప అవకాశంగా పేర్కొన్నారు.



మాట్లాడుతున్న శిద్దా హనుమంతరావు

హరిహరక్షేత్రంలో గోరింటాకు వేడుకలు


హరిహరక్షేత్రంలో ఆషాఢ సారె సమర్పిస్తున్న శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు

చీమకుర్తి: హరిహరక్షేత్రంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి ఆధ్వర్యంలో ఆషాఢ సారె, పలు రకాల పండ్లు, పుష్పాలను సమర్పించారు. మంగళవారం హరిహరక్షేత్రంలో అమ్మవారితో పాటు సకల దేవతలను దర్శించుకొని విశేష పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారికి సంప్రదాయ పండుగల్లో ఒకటైన ఆషాఢ గోరింటాకు పర్వదినం హరిహర క్షేత్రంలో మహిళా భక్తులచే వైభవంగా నిర్వహించారు. గోరింటాకు స్వయంగా లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో మహిళాభక్తులు తయారు చేసి అమ్మవారిని గోరింటాకుకు అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్‌కు చెందిన కుటుంబ సభ్యులు, చీమకుర్తిలో పాటు పలు ప్రాంతాల నుంచి మహిళాభక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

లిఫ్టు పేరుతో మోసం

ఒంగోలు టౌన్: ఓ ఇంటికి లిఫ్టు బిగిస్తానని చెప్పి ఒక యువకుడు మోసం చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. నగరంలోని ఈమని పాలెంలో వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో మూడు అంతస్తుల బిల్డింగుకు లిఫ్టు ఏర్పాటు చేస్తానని అఖిల్ అనే వ్యక్తి.. బిల్డింగు యజమాని ఈమని వెంకట సుబ్బారావును సంప్రదించాడు. ఇందుకు గాను 1.15 లక్షల రుపాయలు వసూలు చేశాడు. రెండు మూడు రోజుల్లో బిగిస్తానని చెప్పిన సదరు వ్యక్తి పత్తా లేకుండా పోయాడు. ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వకుండా కట్ చేస్తున్నాడు. దీంతో సుబ్బారావు మంగళవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గేదె దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మార్కాపురం: మండలంలోని బొందలపాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం భూపతిపల్లి సచివాలయ కన్వీనర్ భవనం వెంకట్రామిరెడ్డిని గేదె పొడవడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి హుటాహుటిన తన వాహనంలో ఎక్కించుకుని చికిత్స నిమిత్తం ఒంగోలు తీసుకెళ్లారు.

కోడిపందేల నిర్వాహకులకు సంకెళ్లు

గిద్దలూరు రూరల్: మండలంలోని కెఎస్ పల్లె గ్రామ శివారు ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. అందిన సమాచారం మేరకు కోడిపందేలు ఆడుతున్నారని సమాచారం అందడంతో ఆయన తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. కోళ్లతో పాటు రూ.1190 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కొత్తపట్నం: మండలంలో 15 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్టాండింగ్ కమిటీ సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సహజవనరుల యాజమాన్య కార్యచరణ కమిటీ, మౌలిక సదుపాయాల కార్యచరణ కమిటీ మానవవనరుల యాజమాన్య కార్యచరణ కమిటీ సభ్యులతో వివిధ రకాల పథకాల గురించి అధికారులతో చర్చించారు. ఎంపీపీ మాట్లాడుతూ భూమి ఆన్‌లైన్ లేని వారికి, అసైన్‌మెంట్ పట్టా భూములకు కూడా ఇ-క్రాప్ చేయాలని రైతు భరోసా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఏవో మోహన్‌రెడ్డి ఆదేశించారు. పశువైద్యశాఖ నుంచి గేదెలు, గొర్రెలకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి బీమా గురించి రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి పన్నులు వేగవంతం చేసి సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కోవిడ్ బిల్డింగ్ రూ.9.8 లక్షలు మంజూరు అయిందని బేస్‌మెంట్ వేయటానికి ఈ నగదు చాలదని.. ఎస్టిమేషన్ వేయించాలని డాక్టర్ శివపార్వతిని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 27 రకాల పరీక్షలకు సంబంధించిన పరికరాలున్నాయని ప్రజలకు తెలియపరచటానికి కరపత్రాలు ద్వారా అందరికి తెలియజేసే విధంగా పంపిణీ చేయాలన్నారు. మత్స్యశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం కిసాన్ అందరికి వర్తించాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు. ఇప్పటికే మండలంలో 4,200 మంది ఉండగా 3600 మంది చేయించుకున్నారని మిగతా రైతులు కూడా చేయించుకోవాలని కోరారు. అర్హులందరికీ కౌలురైతు కార్డు మంజూరు చేశామన్నారు. పశువైద్యశాఖాధికారి ఆశా మాట్లాడుతూ ఒక గేదెకు రూ.400 ప్రీమియం చెల్లిస్తే రూ.30వేల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పశువులకు ప్రమాదం సంభవిస్తే 1962 ట్రోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసిన వెంటనే అంబులెన్స్ మీ గ్రామానికి వచ్చి వైద్యం చేస్తుందన్నారు. పీఆర్‌జేఈ శేషగిరిరావు మాట్లాడుతూ 15 సచివాలయాలకు గానూ 13 సచివాలయాలు పూర్తి చేశామని, 14 రైతు భరోసా కేంద్రాలు, 11 హెల్త్ క్లినిక్ సెంటర్‌లు పూర్తి చేశామన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ రెండో ఫేజ్‌లో నాడు-నేడు కింద 30 పాఠశాలలు గానూ రూ.15 కోట్లు మంజూరయ్యాయని రూ.5 కోట్లు నగదు పనులకు కాంట్రాక్టర్ల అకౌంట్‌కు జమ చేశామని చెప్పారు. ఎంపీడీవో పి.సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, రామమోహన్, ఎంపీటీసీలు, ఏవో నరేంద్ర, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య పాల్గొన్నారు.


స్టాండింగ్ కమిటీలో పెండింగ్ పనులను చర్చిస్తున్న లంకపోతు అంజిరెడ్డి

సామాజిక సేవలో ఎస్‌బీఐ ముందంజ

- రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతం
- కొప్పోలులో నూతనంగా ఎస్‌బీఐ బ్రాంచ్ ప్రారంభం
- ప్రారంభించిన ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర జా

ఒంగోలు సబర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఎస్‌బీఐ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని ఆ బ్యాంకు అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర జా అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలో పర్యటించారు. పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొప్పోలులో నూతనంగా ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ప్రారంభించారు. నగరంలోని పలు శాఖలను, రీజినల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇటీవల సౌత్ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఆర్ఏసీపీసీ విభాగాన్ని కూడా పరిశీలించారు. జిల్లాలోని బిల్డర్స్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కొప్పోలు బ్రాంచ్‌లో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుణాల మంజూరు వేగవంతం చేయటానికి ఒంగోలులో నూతనంగా ఆర్ఏసీపీసీ విభాగాన్ని నెలకొల్పామన్నారు. ఖాతాదారులకు అనుకూలంగా పనిచేస్తూ వారికి మరింత మెరుగైన సేవలు అందించటమే తమ లక్ష్యమని చెప్పారు. బిల్డర్లకు బ్యాంకు నుంచి కావాల్సిన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ పూర్తిగా ఉంటాయన్నారు. అనంతరం రీజియన్ పరిధిలోని 45 ఎస్‌బీఐ శాఖలకు చెందిన మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. బ్యాంకు వ్యాపారాభివృద్ధికి కృషి చేయాలని, ఖాతాదారులకు మంచి నాణ్యమైన సేవలు సకాలంలో అందించాలని సూచించారు. తొలుత శింగరకొండ ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి ఫ్రిజ్, కంప్యూటర్లు అందజేశారు. ఆలయంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ గుంటూరు డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాఠి, ఒంగోలు రీజినల్ మేనేజర్ ఎస్.సుబ్రహ్మణ్యం, ఆర్ఏసీపీసీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పీటీ. వెంకట్రావు, కొప్పోలు శాఖ మేనేజర్ సునీల్ బాబు, వి.శ్రీనివాసరావు, పీవీ.చంద్ర శేఖర్, చీఫ్ మేనేజర్లు పీవీఎన్ ప్రసాదు, నాగేశ్వరరావు శ్రీనివాస రావు, పీవీ ప్రసాదు, భవానీ శంకర్ పాత్రో, హెచ్ఆర్ మేనేజర్ చంద్ర, కే.జానకి రామయ్యతో పాటు బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.


బ్యాంకు ప్రారంభిస్తున్న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

రాచర్ల: మండలంలోని చినగానిపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఈర్లపాటి పిచ్చయ్య (37) ఆదివారం మధ్యాహ్నం హిమాచల్ ప్రదేశ్‌లో గుండె పోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పిచ్చయ్య గడిచిన 15 ఏళ్లుగా ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం టిఫిన్ చేసేందుకు తోటి ఆర్మీ జవాన్‌లతో కలిసి క్యాంటీన్‌కు వెళ్లాడు. ఆ సమయంలో నడుపునొప్పి రావడంతో యూనిట్‌లో ఉన్న వైద్యశాలలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఆర్మీ హాస్పిటల్‌కు తరలించి వైద్యం చేస్తున్న సమయంలో మృతి చెందాడు. పిచ్చయ్యకు భార్య నిర్మలతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని

ఒడిశా వాసి మృతి

మద్దిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒడిశా వాసి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత జాతీయరహదారిపై వెంకట్రాజుపాలెం వద్ద జరిగింది. ప్రమాదం గురించి తెలుసుకున్న మద్దిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆ వ్యక్తి ఆచూకీ కోసం వెతకగా.. మొబైల్ సిమ్ ప్యాంట్ జేబులో ఉండటంతో దాని ఆధారంగా గుర్తించారు. ఎస్సై శ్రీకాంత్ సమాచారం మేరకు..ఒడిశాకు చెందిన ప్రసాద్(32) అనే వ్యక్తి గత వారం తిరుపతిలో తనకు తెలిసిన వ్యక్తులు బ్రిక్స్ తయారీ ప్లాంట్‌లో పని చేస్తుండటంతో పని కోసం వారి వద్దకు వెళ్లాడు. అక్కడే అక్కడ పనిలేకపోవడంతో రెండు రోజులు అక్కడే ఉండి తిరిగి విజయవాడ వైపు వెళుతూ మార్గ మధ్యంలో మద్దిపాడు సమీపంలో దిగినట్లు తెలిపారు. అతనికి మతి స్థిమితం తక్కువని కుటుంబసభ్యులు చెప్పినట్లు ఎస్సై తెలిపారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రసాద్ మృతదేహం

లింగా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సంతాపం

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు లింగా రామకృష్ణారెడ్డి తల్లి వెంకట రత్నం మంగళవారం ఉదయం మృతి చెందారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సాయంత్రం వెంకట రత్తమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం లింగా సోదరులను పరామర్శించారు. మాతృమూర్తి మృతి చెందడం పట్ల ఆయన లింగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, నర్రా సురేష్, రావూరి ప్రసన్న అంజిరెడ్డి, అశోక్‌రెడ్డి, కొమ్మూరి సుధాకర్ పాల్గొన్నారు.


లింగా రత్తమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో నాయకులు

జగనన్న సురక్షతో లబ్ధి చేకూరాలి

ఒంగోలు అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వివిధ అభివృద్ధి, సంక్షేమ అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి సర్వే నిర్వహించాలన్నారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించని సిబ్బందితో మళ్లీ సర్వే చేయించి, ఆ సచివాలయ పరిధిలో సురక్ష కార్యక్రమాన్ని మరల నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, వలస వెళ్లినవారిని గుర్తించి వాళ్లకి కూడా కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూర్చాలన్నారు. ఏపీ సేవా సర్వీసులకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించిన ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులను ప్రారంభించాలన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. జలశక్తి అభియాన్ పనులకు సంబంధించిన అంచనాలను పంపి అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేయాలని కోరారు. ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. హార్టీ కల్చర్ పనులకు సంబంధించి 48 గంటల్లో ప్రతిపాదనలను పంపించి అనుమతులు తీసుకోవాలని చెప్పారు. అమృత్ సరోవర్ పనులను ఆగస్టు 15 కల్లా పూర్తి చేయాలన్నారు. ఈపనులను ఎంపీడీఓలు, ఏపీఓలు పరిశీలించాలన్నారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులకు పరిశీలన నిమిత్తం పంపిన పనులను త్వరతగతిన పరిశీలించి నివేదిక పంపాలన్నారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు ఉన్నాయో లేదో ఈ నెల 21లోపు సర్వే పూర్తి చేయాలని చెప్పారు. జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాలను చేరాలన్నారు. ముందుగా భూ సేకరణ, రెవెన్యూ అంశాలపై స్పందన భవనంలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. డీపీఓ నారాయణ రెడ్డి, డ్వామా పీడీ శ్రీనారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, హౌసింగ్ పీడీ పేరయ్య, పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి ఉషారాణి పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయాలి

మార్కాపురం టౌన్: మార్కాపురం మార్కెట్ యార్డులో గత రెండేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న దివ్యాంగుల ఉపకరణాలను వెంటనే పంపిణీ చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి మంగళవారం కోరారు. 2020లో అలీంకో సంస్థ జిల్లా వ్యాప్తంగా సర్వే చేసి 2 వేల మంది అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేసిందని, వారి కోసం పరికరాలు తెప్పించి మార్కాపురం మార్కెట్ యార్డులో ఉంచిందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరికరాలు పంపిణీ చేయిస్తే దివ్యాంగులు ఉపయోగించుకుంటారని విజ్ఞప్తి చేశారు. అలీంకో సంస్థ సీనియర్ మేనేజర్‌ను సంప్రదించగా ఆగస్టు 15వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారని, మార్కాపురం, కనిగిరిలో క్యాంపులు ఏర్పాటు చేసి దివ్యాంగులకు ఉపకరణాలు ఇప్పించాలని కోరారు.